# అనుమానం అంచుల్లో...

ఐతా చంద్రయ్య

కలల అలల మీద సంబరాలు జరుపుకునే సగటు ఉద్యోగి అంటే పైఅంతస్తులలో ఉన్నవారి దృష్టిలో గానుగెద్దు. గానుగెద్దు జీవితమంటే దినదినగండం నూరేళ్లాయుషు. నూరేళ్లాయుష్షం టే... నూరు నెలల్లో గూడా చతికిలపడిపోవచ్చు.

పచ్చి నిజాలు మెదడు ఆరల్లో గిరికీలు కొడుతూంటే రోజుట్లాగే ఆఫీసులో అడుగు పెట్టాను. అలవాటు ప్రకారం అటెండెన్సు రిజిస ట్రర్లో సంతకించి నా సీట్లో కూచోబోతున్నాను. ఆఫీసు అటెండర్ అమరేశం రామబాణంలా నా ముందుకు దూసుకొచ్చి ధ్వజస్తంభంలా నుంచున్నాడు. కూచోవద్దని సైగ జేశాడు.

"సార్సార్!" ఆ నాటి శ్రీరాముని చేతిలో శివధనుస్సులా వంగి నా చెవిలో బ్రహ్మోపదేశం చేస్తున్నట్టు, "అమ్మలమ్మ ఎవడో కోన్ కిస్కాగాడితో లేచిపోయిందటా!" తాజావార్త ఊదేశాడు.

అదెట్లా? నూటికి నూరుపాళ్లూ అమాయకురాలిలా కనిపించే అమల అంత పంజేసిందా? కోరవయసులో ఉంది. దొరచూపు లేమో కాని దొంగచూపు లున్నట్టనిపించదు.

సీట్లో కూలబడుతూ అటూ ఇటూ చూశాను. ఆడా, మగా తేడా లేకుండా తోటి ఉద్యోగులు కంప్యూటర్లు, కాయితాలు వదిలేసి గుసగుస లాడుకుంటున్నారు.

మా ఆఫీసరు కామేశ్వర్రావు గారంటే నిఖార్సైన మనిషని అప్పటి దాకా అందరికీ తెలుసు. అతనింటి కెదురింట కాపురముంటున్న అటెండర్ అమరేశానికి అందరి కంటే కొంచెం ఎక్కువే తెలిసుం డొచ్చు.

కువకువలాడే కుందనబొమ్మ అమల, మా ఆఫీసర్ కామేశ్వర రావు గారి గారాలపట్టి. అప్పుడప్పుడూ ఆఫీసుకొచ్చి నేరుగా చాంబర్లో చొరబడుతుంది. వాళ్ల నాన్నగారి కేవేవో కబుర్లు చెప్పి ఎంతో కొంత పర్సు ఖాళీ చేయిస్తుంది.

మూడు నెలల క్రితం వరకూ అమల అంటే నిప్పు లాంటిదనే అభిప్రాయం నాలో గాఢంగా ఉండేది. సప్తసముద్రాల లోతు తెలు సుకోవచ్చు కాని మనిషి లోతు తెలుసుకోలేమన్నారు, సీనియర్ సిటిజన్స్. ఓ ఫైన్ ఈవినింగ్, పచ్చని పార్కులో నా అభిప్రాయం నాకే ఎదురు తిరిగి, ఎద్దేవా చేసింది.

ఆ రోజు.. దినమంతా ఆఫీసు గోదాలో పహిల్వాన్లలా బలిసిన పెండింగ్ ఫైళ్లతో కుస్తీ పట్టాను. ఆలసి ఆపసోపాలు పడుతూ ఇంటి కెళ్లేసరికి ఇంటి ఇల్లాలు అంటే నా శ్రీమతి కాటుక కనురెప్పల్ని టపటపలాడిస్తూ స్వాగతించింది.

హమ్మయ్య! కాస్సేపు సరదా పరదాల మీద తేలిపోవచ్చు.


...ఊహల ఊయల ఎక్కబోయాను. ఆశలు ఆకాశంలో విహరిద్దా మంటే నుదుటి రాత పాతాళంలో పాతేసిందన్నట్టు, బామ్మర్ది నక్షత్రకుడిలా ప్రత్యక్షమయాడు.

"హాయ్ బావాజీ! బాగున్నావా?" పళ్లికిలిస్తూ చెయ్యందుకుని షేక్ హాండిచ్చాడు. "నేనప్పుడే వచ్చానోచ్!"

ఛీ...! పానకంలో పుడక! కూలబడ్డాను. పైకి మాత్రం బలవంతపు చిరునవ్వు అతికించుకున్నాను. బెటరాఫ్ అందించిన ఫుల్ చాయ కప్పు గటగటా ఖాళీ చేశాను. చాయోత్సాహం నరాల్లో స్వరాలు పలికింది. పీనుగులాగున్న ఉత్సాహం ఏనుగులాగైంది. ప్రపంచమంతా ఒక వైపైతే పెళ్లాం తమ్ముడు ఇంకోవైపన్నారు గదా! బామ్మర్దితో సరదాగా కబుర్లు షురువౌపోయినై. మాట మధ్యన బామ్మర్ది, "మీరు హైదరాబాదొచ్చి చాలా రోజులైంది గదా!" వాళ్లక్కయ్య వైపు చూస్తూ నాతో అన్నాడు.

ఆవిడూరు కుంటుందా? "రోజులేమిట్రా? నెలలు దాటి సంవత్స రాల్లో కొచ్చింది. ఎమ్మెల్లేగా ఎన్నికవగానే మంత్రి పదవొచ్చినట్టు మీ బావకు ప్రమోషన్‌తో పాటు సిటీకి ట్రాన్స్‌ఫరై రెండేళ్ల మూడు నెలలైంది, తెల్సా?" కళ్లు తిప్పుతూ చెబుతూంటే మూతీ, ముక్కూ గమ్మత్తుగా కదిలినై. ఖాళీ కప్పు లోపలికి తీసుకెళ్లింది.

"నాకీ రోజు ఇందిరాపార్కు చూపించాల్సిందే బావా!" పాత



డిమాండ్ కొత్తగా ముందుంచాడు.

"ఇందిరాపార్కంటే లవర్స్ పార్కు. తెలుసా?" నొప్పించక తప్పించుకోవాలనే ప్రయత్నమో బాణం వదిలింది. అది వంటింట్లోకి దూసుకెళ్లి వాళ్లక్కయ్యకు తాకింది.

"అయితే ఏంటటా? మా తమ్ముడేమన్నా మూడు కాళ్ల ముసలోడా లేక మీలాగ ఇద్దరు పిల్లల తండ్రా? పెళ్లి కాని బ్రహ్మచారండీ!" గర్వంగా దబాయిం చింది. బయటికి కొస్తూ కొంగున నడుముకు బిగించింది.

"అయితే బ్రహ్మచారుల్లో పెళ్లైన బ్రహ్మచారులు, పెళ్లి కాని బ్రహ్మచారులని రెండు రకాలుంటారన్న మాటా!" విషయం దారి మళ్లించాలనే ప్రయత్నం మరో బాణం వదిలింది.

"ఆ విషయమ్మీద అరగంట అనర్గళంగా మాట్లాడగలను. ఇప్పుడా లాజిక్కు, మ్యాజిక్కు మాటలెందుగ్గానీ, వాణ్ని మన హీరో హోండా మీద ఇందిరాపార్కు తీసుకెల్తున్నారా లేదా?" వీరనారిలా సవాలు విసిరింది.

నేను కాదంటే పిల్లలు ట్యూషన్నుండి రాగానే ఆవిడే ఆటోలో తీసుకెళ్లొచ్చు. అదో పెద్ద దుబారా ఖర్చు. బోధన్ నుండి వచ్చిన బామ్మర్దికి భార్య సపోర్టు లాజవాబైంది. చాకచక్యాన్నంతా చంకలో మలిచి పెట్టి సరెండరవ తప్పలేదు.

జనసంచారంతో ఇందిరాపార్కు ఇంద్రప్రస్థనగరం లాగుంది. చుట్టూరా, మధ్యమధ్యన వరుసల్లో ఏపుగా పెరిగిన అశోకచెట్లు, రకరకాల పూలమొక్కలు, రంగురంగుల పూలు, ఫోకస్ లైట్ల వెలుతురు కప్పుకున్నై. చల్లని పిల్లగాని ప్రియురాలి స్పర్శలా గిలిగింతలు పెడుతోంది. మేమిద్దరం ఓ మూలకెళ్లి కూచున్నాము. కత్తిరించిన గడ్డి మెత్తని పరుపు లాగుంది. ఎటు చూసినా కొంటెచూపుల జంటలే రకరకాల ఫ్యాషన్ డ్రెస్సుల్లో కనిపిస్తు న్నాయి. మాలాంటి మగజంటలు, ఒంటరిగాళ్లు తక్కువున్నారు. ప్రేమజంటలు నేరుగా చెట్ల చాటున అదృశ్యమవుతున్నాయి.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం- ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

"అటు చూడు బావా! ఆ జంట చిలకాగోరింకల్లా చూడముచ్చటగా ఉంది కదూ!" భుజాలు ఒరుసుకుంటూ మా వైపు వస్తున్న యువ జంటను చూపిస్తూ, బామ్మర్ది సంబరపడిపోయాడు.

అబ్బాయి అందంగా ఉన్నాడు. వయసు పొంగుల అమ్మాయి ఇంకా అందంగా ఉంది. అరే...! ఆ అమ్మాయి అమల. మా ఆఫీసర్ గారమ్మాయే. అబ్బాయెవరో తెలీదు. కైపు కబుర్లలో ఉన్నారేమో, మా ముందు నుంచే వెళ్లి మావిగున్న మాటున మాయమైంది. ఇటు బామ్మర్దితో మాట్లాడ్తున్నారు గాని అటు లోలోపల అనుమానం గోకుతోంది. లోహంముక్క నాకర్షిస్తున్న అయస్కాంతంలా మనసు అటే లాక్కెళ్తోంది.

మనిషిని బోలిన మనుషులు బోలెడు మందుండొచ్చు. ఆమెను గుర్తించడంలో నేను పొరపాటు పడొచ్చు. సముదాయించుకుం టున్నాను.

ఓ గంట తర్వాత ఆ జంట బయటికొచ్చింది. ఒరుసుకుంటున్న భుజాలు, కొంటె నవ్వులు... అమలనేనా? తేల్చుకోవాలనుకు న్నాను.

"ఏమ్మా అమలా, బాగున్నావా?" కావాలనే పలుకరిం చాను.

ఆమె అదరలేదు, బెదరలేదు. "బాగున్నా నంకుల్!" ఓ చూపు విసిరి వెళ్లిపోయింది.

కడుపులో కలెబెట్టినట్టైంది.

మర్నాడు ఆఫీసులో గాలిదుమారంలా ఆఫీసర్ కామేశ్వర్రావు చాంబర్లో కెళ్లాను. అతని మొహం పూర్ణవికసితకమలంలా మెరిసిపోతోంది. హుషారుగున్నాడు. విషయం తెలిస్తే ముఖారవిందం ముడుచుపోవడం ఖాయం. మొగ్గ దశలోనే అమల వ్యవహారం చక్కబడాలి.

"సార్!" కుర్చీలో కూచుంటూ పలకరించాను.

"యస్!" నవ్వేశాడు. ఏమి సంగతన్నట్టు కళ్లతో అడిగాడు.

ఇందిరాపార్కులో చూసిందంతా పూసగుచ్చినట్టు చెప్పేసి నెత్తి మీదున్న బరువు దిగిపోయినట్టు ఫీలయ్యాను.

ఆయన ముఖకవళికలేమీ మారలేదు. "థ్యాంక్స్ గుడ్ న్యూస్ చెప్పారు" ఆనందించాడు.

ఐదు వేలు విలువ లేని ఇంటిని ఐదు లక్షల రూపాయలకు ఇన్సూర్ చేసి అది తగలబడిపోతుంటే సంబరపడిపోతున్న ఆసామి లాగయ్యాడు. అవాక్కయ్యాను. "పెళ్లీడు కొచ్చిన అమ్మాయి అలా తిరగొచ్చా సార్?" తేరుకుని ధైర్యంగా అడిగాను.

"కాలం వేగంగా పరుగెడుతోంది. భాయ్!" రింగ్ చేర్ వెనక్కు జేరగిలబడుతూ తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. "పెళ్లీడు అమ్మా యిలు మాత్రమే అలా తిరగాలి. ఎందుకంటే పెళ్లిళ్ల మార్కెట్లో పెళ్లికొడుకుల కట్నం రేటు లక్షల్లోకి ఎగబాకింది. కట్నాల నుండి ఆడపిల్లలు బయట పడకుండా ప్రేమ పెళ్లిళ్లేశరణ్యం. మా అమ్మాయి అదే బాటలో నడుస్తుందంటే... అది గుడ్ న్యూస్ కాదా?" మురిసిపోయాడు.

ముందున్న కంప్యూటర్ ఎగిరొచ్చి నెత్తి మీద పడ్డట్టనిపించింది. "అయితే... అమల అదృష్టవంతురాలంటారా?" నా నుదురు పీట ముడేసుకుంది.

"నేను అనడం కాదు. కొద్దిరోజుల్లో మీరే అంటారు. కాలం కలిసొచ్చి ఆ ప్రేమ ముదిరి పెళ్లైపోతే నేను కూడా అదృష్టవంతుణ్నే అంటారు. కాపోతే గిట్టనివాళ్లు కుళ్లుకుంటారంతే." "కాలం కలిసి రాకపోతే ఎట్లాసార్?"

"అతన్తో పెళ్లవదు. అంతే కదా! అయినా మనం ఆశాజీవులం. మంచినే ఆశించాలి. లేనిపోనివి ఊహించుకుని వంకరటింకరగా ఆలోచిస్తే కంప్యూటర్ కీ బోర్డే కాలనాగులా కనిపిస్తుంది."

"కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు. కాలం కాటేస్తే ఎట్లా సార్?" అడగాలనుకున్నాను గాని, మొండిగా ఆఫీసర్తో వాదిస్తే దండి నష్టం జరగొచ్చు. బాంబు లాంటి సందేశం డూప్లికేటు టపాసులా తుస్సుమంది.

మరిప్పుడేమైంది? పాపం అమల. ఆఫీసర్ పరువుమర్యాదలను మట్టిలో కలిపేసి, తన దారి తాను చూసుకుంది. ఫ్చ్...! ఆయన ఆఫీసులో మొహమెత్తుకుని తిరగ్గలడా? బహుశః అమ్మాయి అన్వే షణలో బయలుదేరుంటాడు.

నా ఆలోచన కర్థమే లేదన్నట్టు ఆఫీసర్ కామేశ్వరరావు ఠంచన్గా ఆఫీసు కొచ్చాడు.

"సార్, మిమ్ముల్ని పెద్దసారు రమ్మంటున్నారు" అటెండర్ గొంతు అందరికీ వినబడింది.

పాపం! కూతురు చేసిన నిర్వాకానికి అవమానాన్ని కక్కలేక మింగలేక ఎంత అవస్థ పడుతున్నాడో! ఇప్పుడతనికి 'ఏదో చిన్న పిల్ల, తిరిగొస్తుంది" అని సముదాయించాలా లేకపోతే పోయిందని ధైర్యం చెప్పాలా? రెండూ కాక నేను చెబితే వినక చెడిపోయావని మందలించాలా? సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతూ చాంబర్లో అడుగు పెట్టాను.

"వెల్కం. రండి కూచోండి' అనుకున్నదేదో అవలీలగా సాధించినట్టు హర్షాతిరేకం వెలిబుచ్చాడు.

కలనా, నిజమా? ఒళ్లు గిల్లుకున్నాను. నిజమే!

"మీరు నాకు కంగ్రాట్స్ చెప్పాలి" కుడి చెయ్యి ముందు కొచ్చింది. అయితే అమల లేచిపోయిందన్న వార్త గాలికబు రన్నమాట. చేతిలో చెయ్యి కలుపుతూ కూచున్నాను.

"విశేషమేమిటి సార్?" చిరునవ్వు పెదాల కతికించుకున్నాను.

"ఆ రోజు మా అమ్మాయి గురించి నేనేమన్నాను?" మొహం అప్పుడే కొత్తగా ఓపెన్ చేసిన ఫైలు బేకర్లా నీట్గా ఉంది.

"ప్రేమ ముదిరి పెళ్లైపోతే..."

"కరెక్ట్! ఇప్పుడదే జరగబోతుంది. మా అమలా, ఆ అబ్బాయీ, జంటగా వెళ్లిపోయారు. ఏ పోలీస్ స్టేషన్లోనో, గుళ్లోనో దర్జాగా పెళ్లి చేసుకుని ఝామ్మని తిరిగొస్తారు. కానీ ఖర్చు లేకుండా శుభం కార్డు పడిపోతుంది. అవునా?" సూటిగా చూశాడు. ఆ చూపుల్లో ఎంత ఆత్మవిశ్వాసమో!

"ఇలాంటివీ రోజుల్లో మాములూ పోయినైగానీ ఆ అబ్బాయి ఎవరో, ఏం చేస్తున్నాడో కనుక్కున్నారా సార్?"

"అబ్బా, మీకన్నీ అనుమానాలే. మా అమ్మాయంటే ఏమనుకున్నారు? ఆణిముత్యమండీ. అల్లాటప్పాగాడిని ప్రేమిస్తుందా? అతని గురించి, వాళ్ల కుటుంబం గురించి నలుగురి నడిగి ఆరాలు తీస్తుంటే వాళ్లమ్మానాన్నలకు తెలిసిపోతుంది. వెంటనే వాళ్లకు కట్నం కలరా సోకుతుంది." చూశావా నా ప్లాను ఎంత పకడ్బందీగా ఉందో అన్నట్టుగుందతని వాలకం.

"కావాలనే అడగలేదా లేక ఆఫీసు నుండి నేరుగా పేకాట క్లబ్బుకెళ్లి, ఏ రాత్రో ఇంటికెళ్లే అలవాటు అందుకంగీకరించ లేదా?" పీకల దాకా వచ్చిన ప్రశ్నను మొహమాటం నమిలి మింగేసింది.

"అయితే... కంగ్రాట్స్ సార్!" అరువు చిరునవ్వుతో కరచాలనం చేశాను. ఆన్ చేసిన కలర్ టీవీలా కామేశ్వర్రావు కళ్లల్లో కాంతి పుంజాలు తళుకుమన్నాయి.

అతని అభిప్రాయం కచ్చితంగా తప్పని ఎలా చెప్పగలం? నన్ను నేనే మందలించుకున్నాను.

ఆ రోజంతా ఆఫీసులో అదే విషయంపై వేడి గుసగుసలు, వాడి సమాలోచనలు సాగినై. మర్నాడు చల్లబడింది. మూడో రోజు చప్పబడింది. ఆ తర్వాత మరపు మబ్బుపొరల్లో కూరుకుపోయింది.

కాలచక్రం గిరగిరల్లో ఆర్నెల్లు గడిచిపోయినై.

అలవాటు ప్రకారం ఆ రోజు గూడా ఆఫీసుకు ఐదు నిమిషాలు ముందెళ్లాను. అటు ఆఫీసులో అడుగుపెడుతూంటే ఇటు అటెండర్ అమరేశం "సార్...హెడ్డాఫీసు నుండి ఫోను మీకే... రండి" పిలిచి ఫోన్ నా చేతి కందించాడు. అట్నుంచి వినబడ్తోంది.

"హల్లో... ఆс... మీరేనా? అనుకోకుండా కామేశ్వర్రావుగారికేదో అర్జంట్ పని తగిలిందటా. మూడ్రోజులు లీవు కావాలని ఫోన్ చేశారు. మీరు ఇంచార్జ్‌గా పంజెయ్యండి. తాళాలు అటెండర్తో తెప్పించుకోండి" ఫోన్ మెస్సేజ్.

"అమరేశం! కామేశ్వర్రావు సారింటికెళ్లి..." నా మాట పూర్తి కాకముందే, "తాళం చెవులా సార్? ఇదో.. పొద్దున్నే నన్ను పిలిపించుకుని ఇది మీకివ్వమని సారు నాకిచ్చారు" జేబు లోంచి తాళాలు తీసి, నా చేతి కందించాడు.

ఆఫీసులో సీనియర్ మోస్టును కాబట్టి ఆఫీసర్‌గారెప్పుడు లీవులో వెళ్లినా, ఆ బాధ్యత నా నెత్తి మీది కొచ్చి కూచుంటుంది.

ఇప్పుడింత అర్జెంటు పని ఏముందో?

"అమరేశం! కామేశ్వర్రావు గారి ఆరోగ్యం బాగానే ఉంది కదా?" ఎందుకైనా మంచిదని అడిగాను.

"ఇయ్యాల్ల పొద్దున మన సారు డాబా మీద కాలుగాలిన పిల్లలెక్క తిరుగుతున్నాడు. బాగానే ఉన్నాడు సార్!"

"ఆ తిరుగుడు వెనక ఏముందటా?"

"ఏమో కాని... వాళ్లమ్మాయి అమలమ్మ కన్పించింది. నిన్న రాత్రి వచ్చిందటా."

ఆర్నెల్ల క్రితం మాయమైన అమ్మాయి... మనసులో ఏదో వికారం, ఆ పైన ఆపుకోలేని ఆసక్తి.

"అట్లానా... అయితే అమల భర్తతో సహా వచ్చిందా? ఎంతయినా మనాఫీసరు అదృష్టవంతుడే. అర్ధరూపాయి ఖర్చు లేకుండా అమ్మాయి పెళ్లి బాధ్యత తీరిపోయింది. సరే, అమల భర్త కనిపించాడా?"

"వాళ్లింట్ల కొత్త మనిషెవ్వరూ కనిపించలేదు సార్!"

కొత్త అల్లునికి మర్యాదలందాలి గదా! పెళ్లిసంగతి అంతా నలుగురికి తెలిసేలా బంతి భోజనాలు పెట్టించాలాయె. దాని కోసమే ఆఫీసర్‌గారు లీవులో ఉండొచ్చు. అల్లుడుగారు గదికే పరిమితం కావచ్చు. మనసు కుదుటబడింది.

యథావిధిగా నాల్గోరోజు ఆఫీసుకెళ్లాను.

"సార్! మన పెద్ద సారు రెండ్రోజులు లీవు పెంచేసినారట. మీకు చెప్పుమన్నారు" అమరేశం చెప్పాడు.

అల్లుణ్ని సభ్యసమాజానికి పరిచయం చేస్తూ పార్టీ ఇవ్వాలంటే చాలా పనులుంటాయి. అయినా ఈ మూడు రోజుల్లో మంచి ముహూర్తం లేదేమో! ఇంట్లో సత్యనారాయణవ్రతమో, ఏదో చెయ్యాలాయె.

"అట్లానా! వాళ్లమ్మాయి అమల, అల్లుడుగారితో ఇల్లంతా హడావుడిగా ఉండొచ్చు గదా!"

"అదేమీ కనబడలేద్సార్! మరి లోపలి సంగతి నాకు తెలీదు."

కామేశ్వర్రావు గారి పార్టీ కోసం ఆఫీసు స్టాఫంతా ఎదురు చూస్తున్నారు.

మధ్యాహ్నం యూ.డి.సి. చేతులూపుకుంటూ వచ్చి నా ముందు కూచున్నాడు. "సార్ కామేశ్వర్రావు గారు మన బాస్ గదా! వాళ్లమ్మాయి పెళ్లి పార్టీకి ఖాళీ చేతుల్తో వెళ్తే బాగుంటుందా?" ప్రస్తావించాడు.

"నిజమే! నేడో, రేపో పార్టీకి ఆహ్వానమొస్తుంది. మనమేదన్నా మంచి బహుమానం తీసుకెళ్తేనే మర్యాదగా ఉంటుంది. ఆ ఏర్పాట్లేవో చూడండి" సూచించాను.

"సరే... మన వాళ్లందరికీ చెప్తా సార్!" అప్పుడే పార్టీకెళ్తున్నంత హడావుడిగా వెళ్లిపోయాడు.

రెండ్రోజులు ఎదురుచూపుల్లో గడిచిపోయినై. పార్టీకి పిలుపు రాలేదు. బహుశః దగ్గరి బంధువులకే ఆ పార్టీ పరిమితమైపోయిందేమో! మూడోరోజు కామేశ్వర్రావు గారు ఆఫీసు కొచ్చారు. విషయమేమిటో తెలుసుకోవాలనే ఆసక్తి, వెంటనే చాంబర్లోకి నడిపించింది. తాళాలందిస్తూ, "అమ్మాయి అమల, అల్లుడుగారు, అంతా బాగున్నారా సార్?" యథాలాపంగా అడిగాను.

"అల్లుడా, ఆయనెవరూ?" ఎదురు ప్రశ్న. చూపుల్లో చిరాకు.

చలాకీగా మాట్లాడ్తూ, సినిమా హీరోలా సమస్యలన్నింటినీ సులువుగా పరిష్కరించే కామేశ్వర్రావు గారు వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్ సెమీ ఫైనల్స్‌లో ఓడిపోయిన క్యాప్టెన్‌లా కనిపించారు.

నా కనుబొమలు ముడిపడినై. "అదేసార్! మన అమల ప్రేమించి పెళ్లాడిన..."

"ఊс!" నెత్తి కొట్టుకున్నాడు. ఆ ప్రేమ వన్ వే ట్రాఫిక్ లాగైందంటా. పెళ్లి దాకా రాక ముందే.." మాట పెగల్లేదు. అర చేతుల్లో గదవానించి, మోచేతుల్ని టేబుల్ కానించి కూర్చున్నాడు.

"అం...టే?"

"ఏం చెప్పాలి? చెప్పుకుంటే పరువు పోతుంది" కళ్లల్లో మంచు తెరలు కదలాడినై.

"ప్లీజ్ సార్! వివరంగా చెప్పండి. మనం సన్నిహితులం గదా! అసలేమైంది సార్?"

"నాకున్న సన్నిహితుల్లో హితులు మీరొక్కరే..." చేతిగుడ్డతో కళ్లద్దుకున్నాడు. "ఆ బద్మాష్ ఏ మత్తుమందు చల్లాడో కాని, అమ్మాయితో వరంగల్లులో ఆర్నెల్లు జల్సాగా గడిపి, మాయ మాటు చెప్పి మాయమైనాడట. అమ్మాయికి మూడో నెల. వాడేదో ఉద్యోగం చేస్తున్నానంటూ రోజూ ఏదో ఊరికెళ్లి వచ్చేవాడట. అంతటి తెలివితేటలున్న అమల, అమాంతం బోర్లపడింది. వాని పేరు, అడ్రసు అన్నీ బోగస్ అని తేలినై. ఎంత గాలించినా వాని ఆచూకీ తెలియలేదు. నిన్న అమలకు అబార్షన్ చేయించాను..." గొంతు సహకరించడం లేదు.

ఆరని ఆవేదన లోపలి నుండి తోసుకొస్తుందేమో, మొహం టేబుల్ కతుక్కుపోయింది.